# జ్ఞా గురుతు

తెరిచిన పెట్టె ఖాళీగా భయంకరంగా కనిపిస్తోంది, నలుక జాపిన కాళికలా! బీరువాలో నుంచి లాగిన చీరలు ప్రక్కన కుప్పగా పడి ఉన్నాయి. అవి తీసి పెట్టెలో పడ వెయ్యటానికి తోచటంలేదు. నిర్జీవంగా ఒదిగి కూర్చున్నాను. నా మనస్సులాగే ఆ గదీ చికాకుగా ఉంది. ప్రతి వస్తువు ప్రయాణానికి సిద్ధంగా ఉంది. ఏదో శూన్యంగా పాడుపడినట్లుంది.

ఇక్కడికివచ్చి ఆరు నెలలే అయింది. ఇంతలోనే ఈ గది నాకెంతో ప్రియమైంది. ఇది నా సుఖ దుఃఖాలను పంచుకుంది. ఈ నాటితో మా బాంధవ్యం తెగింది. మళ్ళా ఈ జన్మలో ఇక్కడకు రానేమో!

అక్కకు చిన్నతనంలోనే పెళ్ళయింది. అది నాకు పెత్తల్లి కూతురు. దానికి మంచి సంబంధం వచ్చింది. బావకు చాల ఆస్తి ఉంది పెద్ద వకీలుగా పేరు సంపాదించుకున్నాడు. నిదానం, మంచితనం నిండిన స్వభావం. అయినా అక్కయ్య అదృష్టవంతురాలు కాదు. ఆమె సంతోషంగా ఒక్క ఏడాదయినా కాపరం చేయలేదు. పక్షవాతం వచ్చింది. ఒకవేపు కాలు చెయ్యి స్వాధీనం లేదు. నోటమాట లేదు. పసిపిల్లలా కాపాడవలసిన పరిస్థితి ఏర్పడింది. బావ ఆమెను ఊరూరు తిప్పాడు, వైద్యం కోసం. కాని ఆశ ఫలించలేదు.

అయినా అతను మంచివాడు. నౌకర్ల సహాయంతో ఆమెకు ఏ

ఆచంట శారదాదేవి

లోపం లేకుండా చూస్తున్నాడు. ఎలాగో కాలం గడుపుతున్నాడు. ఎప్పుడూ తన కోర్టు పనిలోనే లీనమయి ఉంటాడు. ఉదయం లేవగానే కోర్టు కాగితాలు ముందర వేసుకు కూర్చుంటాడు. అప్పుడే పార్టీలు కూడా వస్తారు. పదిగంటల వరకు వాళ్ళతోనే సరిపోతుంది. తొందరగా నాలుగు మెతుకులు రుచిచూచి కోర్టుకు వెళ్ళిపోతాడు మళ్ళా చీకటి పడి ఇంటికివస్తాడు. మళ్ళా ఏ కాగితాలో ముందర వేసుకు కూర్చుంటాడు. ఎవరితోను మాట్లాడడు. నౌకర్లు అన్నీ మౌనంగా అమర్చిపోతారు.

వచ్చిన కొత్తలో ఈ జీవితం నాకేదో వింతగా ఉండేది. ఇతను షికారుకైనా ఎప్పుడూ ఎందుకు వెళ్ళడో అనిపించేది. బావగదికి వెనకవైపు గదిలో అక్కయ్య వుంటుంది. ఆమె ప్రాణాలన్నీ బావమీదే ఉంటాయి. అతని ఒక్కొక్క కదలిక, అలికిడి ఆమెకు చిరపరిచితమైనాయి. కోర్టుకు వెళ్ళినప్పుడు తప్ప అతని అలికిడి వినిపించకపోతే ఆమె విలవిల లాడేది. బావ ఎప్పుడో ఒక్కక్షణం అక్కయ్యను చూస్తాడు. ఆమె బాధ చూసి భరించలేడు. వెంటనే వెళ్ళిపోతూ ఉంటాడు.

ఎడారిలా ఉన్న ఈ సంసారంలోకి విధి నన్ను త్రోసింది. ఈ ఊరు చదువు కోసం వచ్చినప్పుడు మా వాళ్ళు నన్ను ఇక్కడ ఉండమన్నారు. ఇక్కడ ఎవరికీ ఏ లోపమూ ఉండదు. బావకు ఆదాయానికి లోపంలేదు. ఔదార్యానికీ లోపం లేదు.

రాగానే ఈ ఇల్లు నాకు స్వర్గంలా తోచింది. చుట్టూ విశాలమైన తోట. పెద్దపెద్ద గదులు, నౌకర్లు, ఆదరణ అన్నీ ఎంతో ఉత్సాహాన్నిచ్చాయి. ఇంటికి దగ్గరలోనే కాలేజి ఉండడం కూడా ఎంతో హాయి అనిపించింది. జబ్బు వచ్చిన తరువాత అక్కయ్యను నేను చూడలేదు. వచ్చిన కొత్తలో దాన్ని చూచి బాధపడుతూ తరుచు దగ్గరే ఉండేదాన్ని. కాని క్రమంగా నాకు దగ్గరకు వెళ్ళడానికే భయం వేసేది. చెయ్యగలిగిందేమీ లేక ఊరికే దాని బాధ చూస్తూ కూర్చోటం మనస్సుకు కలతగా ఉండేది. క్రమంగా వెళ్ళటం మానేశాను.

కొద్ది రోజులకే నా ఉత్సాహం నశించింది ఇక్కడికి ఎందుకు వచ్చానా అని బాధగా ఉండేది. ఎవ్వరితోను మాటాడని బావ నాకు వింతగా తోచాడు. అతనంటే విపరీతమైన జాలి కలిగింది. అతనిలో ఉత్సాహం కలిగించాలన్న కోరిక బలమైంది.

ఏదో మిషతో అతని ఎదుట పడటానికి, అతనిని పలకరించటానికి ప్రయత్నించాను. మొదట నా పిలుపుకు అతను ముభావంగానే సమాధానం చెప్పాడు. ఎవరితోను

మాట్లాడటం ఇష్టం లేనట్లుగా తనలో తాను ముడుచుకు పొయ్యేవాడు. అయినా నాలో కుతూహలం ఎక్కువవుతూనే ఉంది.

నా మంత్రం అతనికోసం ఎదురు చూచేదాన్ని. అతను ఇంట్లో ఉన్నప్పుడు ఏ పత్రికో, పుస్తకమో తీసుకు వెళ్ళి ఏవేవో చెప్పమని అడిగేదాన్ని. అతను అడిగినది చెప్పి తరువాత సరిస్తంగా ఊరుకునేవాడు. కాని ఏదో ఒక క్షణాన అతని వైఖరి మారింది. ఆత్రుతతో నా కోసం ఎదురు చూచేవాడు. చనువుగా అన్ని విషయాలు చెప్పేవాడు. ఎంతో సంతోషంగా ఉన్నట్లు కనిపించేవాడు.

అతను పైకి గంభీరంగా కప్పుకున్న ముసుగు తొలగిపోయి కళ్ళల్లో కాంతి తొణికిసలాడింది. అది చూడగానే నాకు సంతోషం కలిగింది. నేను క్షణం కనిపించకపోతే అతను దిక్కు తోచనట్లు ఉండేవాడు. ఒక్కొక్కసారి కోర్టు కూడా మరచిపోతున్నాడేమో అనిపించేది. అతను అంతగా నన్ను చుట్టుకోటం నాకు భయం కలిగించింది. అయినా ఏమీ అనలేక ఊరుకున్నాను.

ప్రొద్దు పొయ్యేవరకు బావతో మాట్లాడుతూ ఉండేదాన్ని. బావ చాల ఉత్సాహంగా ఉండేవాడు. ఆ క్షణాలలో అతను నాకు పసిపిల్లవాడులా కనిపించేవాడు. ఒకసారి అతని అమాయకమైన ముఖం చూచి, విపరీతమయిన జాలి ముంచుకువచ్చి ఆప్యాయంగా అతని తల నిమిరాను. ఒక్క క్షణం అన్నీ మరచిపోయి అతను నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు. నేను మెల్లగా తప్పించుకున్నాను. జాలిచేత, అగాధంలోకి దిగజారుతున్నానని, ప్రశాంతంగా ఉన్న తటాకాన్ని నిర్హేతుకంగా కల్లోల పెడుతున్నానని ఆ క్షణాన తెలియలేదు. నిస్పృహతో నిర్జీవంగా వున్న బావకేదో ఊరట కలగిస్తున్నానన్న భ్రమలో ఉన్నాను.

ఆ వేళ బావ భోంచేస్తూఉంటే దగ్గరగా కూర్చున్నాను. అలా నేను ప్రక్కన ఉంటేనే గాని అతను సరిగా తినడని నా భ్రమ. అది కొంత నిజమే. అతను కోర్టుకు టైమయిందని తొందరపడుతున్నాడు. గిన్నెలో పెరుగంతా పూర్తిగా వేసుకుంటేనే గాని నేను పోనియ్యనని గట్టిగా చొక్కా పట్టుకున్నాను. అతను నవ్వాడు. నేనూ నవ్వాను. అంతలో ఏదో విసురుగా క్రింద పడ్డట్లు పెద్దగా చప్పుడైంది. ఉలిక్కిపడి వెనక్కుతిరిగి చూచాను. అక్కయ్య! స్పృహ తప్పినట్లు నిలువునా క్రింద పడి ఉంది. ముఖం వణకుతోంది. కళ్ళ వెంట నీరు కారుతోంది. నేను నిశ్చేష్టురాల నయ్యాను. అక్కయ్య ప్రక్కమీద నుంచి లేవగా ఇంతవరకు నేనెప్పుడూ చూడలేదు. తనంతట తాను లేచి గోడలు పట్టుకుని



ప్రాకుతూ రావటానికి అది ఎంత ప్రయాస పడిందో! ఎంత తీవ్రమైన మనస్సంక్షోభంచేత అది అంతటి సాహసానికి పూనుకున్నదో! ఇది ఊహించుకునేటప్పటికి నా ముఖం వెలవెలా పోయింది.

అక్కయ్యకు కదిలే శక్తిలేదు. మనోవ్యథలు చెప్పుకోగల మాట లేదు. అయినా ప్రతి మాట వింటూ ఉంటుంది. విననివి ఊహించుకుంటుంది. మనస్సు కలత చెందుతుంది. తన నిస్సహాయ స్థితిచేత మరింత



క్షోభపడి లోలోపల విపరీతమైన ఆలోచనలతో క్రుంగిపోతుంది

ఎన్నాళ్ళగానో అది నేను బావతో చనువుగా ఉన్నానని, బావ నాతో ఉత్సాహంగా మాట్లాడుతున్నాడని లోలోపల కుమిలి కుమిలి అసూయ చెంది ఉంటుంది చివరకు ఇవ్వాళ ఇక భరించలేక సాహసించి లేచివచ్చి ఉంటుంది భయంతో దిగులుతో నాకు ముఖమంతా చెమటలు పట్టింది ఆ క్షణాన దాన్ని లేవదియ్యాలని కూడా తోచలేదు బావ యాంత్రికంగా దాన్ని ఓదారుస్తూ లేవనెత్తటానికి ప్రయత్నించాడు ఇంతలో నౌకర్లు వచ్చి సహాయపడ్డారు తరువాత డాక్టరు వచ్చి చూచాడు విపరీతమైన మానసికమైన ఆందోళన వలన అక్కయ్య చాల బలహీనంగా ఉన్నదని రెండు రోజులు చాల విశ్రాంతిగా ఉంచాలని చెప్పాడు ఆందోళనకు ప్రత్యేకమైన కారణాలేమైనా ఉన్నాయా అని అడిగాడు బావ మాట్లాడలేదు, నేనూ మాట్లాడలేదు ఒక్కసారిగా సమస్తం పోగొట్టుకుని దిగజారిపోయిన వ్యక్తిలా బావ ముఖం నీరసించి ఉదాసీనంగా ఉంది అతను మామూలుగా కోర్టుకు వెళ్ళిపోయాడు లోపలనుంచి వెళ్ళిపోతూన్న అతని ముఖం చూచాను నాకు కళ్ళనిండా నీళ్ళు వచ్చాయి. అతను నన్ను చూడలేదు

ఆ రోజే, ఆ క్షణమే నేను ఇక్కడినుంచి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను లేకపోతే ఇక్కడ తగుల్కొన్న బంధనాలలో నించి ఎప్పటికీ విముక్తి పొందలేక ఎవరిని సంతోషపెట్టలేను నేను సంతోషంగా ఉండలేను అక్కయ్యకు బావకు ఎప్పటికైనా నేను విపరీతమైన మనోవ్యథలకే కారణమవుతాను

నాకు ఒంట్లో బాగుండలేదని కొన్నాళ్ళు చదువు మానేసి ఇంటికి వచ్చేస్తున్నానని అమ్మకు రాశాను. ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకున్నాను ఇక ఈ ఊరు నాకు చాల దూరమవుతుంది ఇక నేను

చదువలేను అయినా అమ్మ ఏమీ అనదు అదే నాకు ధైర్యం


రెండు మూడు రోజులుగా బావ కంటు పడలేదు అతను నా కోసం వెతుక్కొని రాలేదు మా ఇద్దరి మధ్య ఎత్తుగా పెరిగిన అడ్డుగోడలు స్పష్టంగా కనపడుతూనే ఉన్నాయి ఇవ్వాళ ఉదయం అతను కోర్టుకు వెళ్ళబోయేముందు ఒక్క క్షణం బావను చూచాను అతను ఎంతో ఆశతో ఆత్రుతతో నన్ను చూడగానే నా దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు నేను ఒక్కమాటే చెప్పాను "నేను మధ్యాహ్నం బండిలో వెళ్ళిపోతున్నాను చదువు మానేస్తున్నాను" అన్నాను కత్తితో పొడిచి ఓర్చుకోమన్నట్లున్న దామాట అది నాకు తెలుసు బావ ఆ వ్యధ మౌనంగా భరించడానికి ప్రయత్నించాడు ముఖం వాల్చుకున్నాడు అతని కనుకొలుకుల్లో కన్నీటి బిందువులు కనిపించాయి అతను ఒక్కసారిగా పదేళ్ళు పెద్దవాడైనట్లు కనిపించాడు నేను చూస్తూండగానే నా కంటి యెదుటే అతని తల పూర్తిగా నెరసిపోయి, శరీరం అందవికారంగా మారినట్లనిపించింది నీరసంగా "నేను వచ్చి స్టేషనుకు తీసుకు వెడతాను" అన్నాడు "అక్కర్లేదు, నౌకరు వస్తాడు" అని చెప్పాను బాధతో ముఖం ముడుచుకని వెళ్ళిపోయాడు. నాకేసి మళ్ళా తిరిగి చూడలేదు నా కళ్ళల్లో నీళ్ళు నిండాయి




అలా వెళ్ళిపోతున్న బావకేసి వెనక నుంచి చూస్తూంటే నాకు విపరీతమైన జాలి ముంచుకు వచ్చింది అతనికి నేనేదో తీరని అపకారం చేసినట్లనిపించింది నేను రాకముందు అతను ఏదో ఒక విధంగా తన బ్రతుకు తీర్చి దిద్దుకున్నాడు సుఖమో, దుఃఖమో ఉదాసీనంగా రోజులు గడుపుతున్నాడు క్షణకాలం ఆదరణ, అప్యాయత చూపి

షే నతని మనో నిగ్రహాన్ని చెదర గొట్టాను. అతను పూర్తిగా శిథిల మైనప్పుడు నిర్దాక్షిణ్యంగా వదలి నా త్రోవన నేను పోతున్నాను. ఈ ఇంట్లో చాలా రోజులుగా చీకటి అలముకున్నది. ఒక్క క్షణం బావకు వెలుగు చూపాను. ఇప్పుడు మళ్ళీ ఆ చీకట్లోనే వదలి పోతున్నాను. ఈ సారి బావ భరించలేడు. ఒక్క క్షణం మెరసిన మెరవు మరచి పోలేడు. ఈ జీవితం ఇప్పుడు అతనికి భయంకరంగా ఉంటుంది. నిశ్చలంగా ఉన్న తీగను తుఫాను వచ్చి ఊగించి నిరాశ్రయంగా వదలిపోయి నట్లున్నది.

ముందు ఏం జరుగుతుందో నేను ఊహించుకోగలను. బావను మరచి పోవడం నా కేమీ బాధకాదు. నా కాతని మీద జాలితప్ప విపరీత మైన వ్యామోహ మేమీలేదు. ఆ జాలి చేతనే అతని కేదో ఊరట కలిగించాలన్న ఊహతో, పసితనం చేత అతని దగ్గరకు చేరాను. అది ఇలా పరిణమించింది. నాకు జీవిత మింకా ప్రారంభ దశలోనే ఉంది. పసితనమింకా వదలలేదు. అమ్మ దగ్గరకు వెళ్ళగానే ఆ పల్లెటూరి వాతావరణంలో, ఇంటినిండా సంచడిగా వున్న బంధువులలో నేను అన్నీ మరచిపోతాను. బావనీడగానైనా నా మనసులో మిగులుతాడని నమ్మకం లేదు. ఎప్పుడో ఏ రాజకుమారుడో తరలివచ్చి నన్ను ఆనంద ధామానికి



తీసుకు పోతాడని ఉత్సాహంతో ఎదురు చూస్తూ ఉంటాను. ఆ కల ఎప్పుడో ఫలిస్తుంది.

బావ జీవితంలోకి మళ్ళా వెలుగు రాదు. అతను ఈ జన్మలో నన్ను మరచిపోడు. నాకోసం పరితపించి పరితపించి జీవితాన్ని అన్నివిధాల శిథిలం చేసుకుంటాడు. క్రమంగా కోర్టుకు కూడా వెళ్ళకపోవచ్చు! ఈ రెండు మూడు రోజుల్లోనే పరధ్యానంగా ఏ కాగితాలు చూడటంలేదు. వాకిట్లో పార్టీలు సణుగుతున్నారు, సన్నసన్నగా. అయినా అతను విని పించుకోటంలేదు.

ఒక్కక్షణం నాకు పసితనంచేత ఏదో మహాపాపం చేశాననిపిస్తోంది. మనిషిని భౌతికంగా కొట్టిచంపటమే పాపమా! మానసికంగా క్షోభపెట్టటం, బ్రతుకు శిథిలం చెయ్యటం పాపంకాదా అనిపిస్తోంది. ఈ మహాపాపమేదో పుష్కలంగా చేశానని పిస్తోంది. ఆశ్రయమిచ్చిన అక్కయ్యకు, బావకు తీవ్రమైన మనస్సంక్షోభం కలిగించాను. వారిజీవితాల్లో కమ్ముకున్న శూన్యాన్ని మరింత ప్రస్ఫుటంగా వెక్కిరించి చూసి నా త్రోవన నేను పోతున్నాను.

అయినా నేను చెయ్యగల దేమీ లేదు. ఆ మాట చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఎప్పుడో అసంభవమైనది అనుకోకుండా సంభవమై మళ్ళా బావ మనస్సులో శాంతి నెలకొంటుంది. నా మనస్సుకు ఊరట కలిగించుకోటానికి అది ఒక ఆశ.

తెరచినపెట్టె కాళికాదేవి నాలుకలా భయంకరంగా ఉంది. అది చూసి భరించలేకుండా ఉన్నాను. చీరలన్నీ తీసి గబగబ పెట్టెలో పడ వేశాను. కనపడకుండా గట్టిగా మూత వేశాను. వాకిట్లో బండి ఆగింది. నౌకరు పెట్టె తీసుకు వెళ్ళాడు.

మనస్సు మభ్యపెట్టుకుని నేనూ కదలిపోయాను.

***

## చందాదార్లకు

## మనవి

పాత చందా దారులు తిరిగి చందా సైకం పంపేటప్పుడు తమ చందా నంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజరు,
"జ్యోతి"